క్లుప్తంగా

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ



ఎన్నికల నేపథ్యంలో సూచనలిస్తున్న డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి

ఐరాల: స్థానిక పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులు, స్టేషన్ నిర్వహణపై ఎస్‌ఐ వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకున్నారు. డీఎస్పీ మాట్లాడుతూ అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపాలని సూచించారు. రానున్న ఎన్నికల విధులు, బందోబస్తుకు చేపడుతున్న చర్యలు, వాహనాల తనిఖీలు, బైండోవర్లు తదితర అంశాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

తిరుపతిని రాజధానిగా చేయాలి



మాట్లాడుతున్న మాజీ మంత్రి చింతామోహన్

బంగారుపాళెం: తిరుపతిని రాజధానిగా చేయాలని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో హైదరాబాద్ రాజధానిగా ఉండడంవల్ల అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందన్నారు. అదే విధంగ ఆతిరుపతి రాజధాని అయితే రాయలసీమ ప్రాంతం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భాస్కర్, ఉపాధ్యక్షుడు పరదేశి, చిరంజీవి పాల్గొన్నారు.

మురకంబట్టు అర్బన్ హెల్త్ సెంటర్ తనిఖీ



రికార్డులను తనిఖీ చేస్తున్న డీఐఓ

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను గురువారం డీఐఓ రవిరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, వైద్యసేవల రికార్డును పరిశీలించారు. రొటీన్ టీకా అమలుపై ఆరా తీశారు. సిబ్బంది బాధ్యతగా వ్యవహరించి గర్భిణులు, చిన్న పిల్లలకు రొటీన్ టీకా వేయించాలన్నారు. అలాగే పల్స్ పోలియో కార్యక్రమం నేపథ్యంలో 5 ఏళ్ల లోపు పిల్లలను గుర్తించడంతో పాటు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు.

ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి



పాఠశాల వార్షికోత్సవంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం భేరీనాథ్

బంగారుపాళెం: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని అందుకు ముందుకు సాగాలని గుండ్లకట్టమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భేరీనాథ్ అన్నారు. పాఠశాలలో గురువారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సరస్వతీ దేవి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి హెచ్‌ఎం మాట్లాడుతూ, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు విద్యే పునాది అని చెప్పారు. చదువుకు మించిన ఆస్తిపాస్తులు లేవన్నారు. విద్యార్థులు కష్టపడి ఉన్నత విద్యను అభ్యసించి భవిష్యత్తులో ప్రయోజకులుగా ఎదగాలని ఆకాంక్షించారు.. పదోతరగతి విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలన్నారు. పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక నిఘా



ఎస్‌ఐతో మాట్లాడుతున్న ట్రైనీ డీఎస్పీ

పాలసముద్రం: మండలంలో ఎన్నికల సమయంలో ఎక్కువగా గొడవలు తలెత్తే గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ట్రైనీ డీఎస్పీ పవన్ కుమార్ అన్నారు. గురువారం ఆయన పాలసముద్రం పోలీస్ స్టేషన్‌ని సందర్శించారు. గత ఎన్నికల సమయంలో గొడవలు జరిగిన గ్రామాల్లో కానిస్టేబుళ్లు రోజూ పర్యటించాలని, గొడవలకు తావివ్వరాదని గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. ఎవరైనా అనుమానితులు సంచరిస్తుంటే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. పాత నేరస్తులు, రౌడీషీటర్ల కదలికలపై ఓ కన్నేసి ఉంచాలన్నారు. అలాగే ఇసుక, మద్యం అక్రమ రవాణా కట్టడికి చర్యలు తీసుకోవాలన్నారు.

జగనన్నను మళ్లీ సీఎం చేద్దాం

- వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి డాక్టర్ సునీల్ కుమార్
- పూతలపట్టులో వలంటీర్లకు పురస్కారాల ప్రదానం
- తవణంపల్లెలో ఆసరా చెక్కుల పంపిణీ



యాదమరి: మాధవరంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మహిళలు, డాక్టర్ సునీల్ కుమార్

యాదమరి: రాబోవు ఎన్నికలలో జగనన్నను సీఎం చేసుకుందాం అంటూ పూతలపట్టు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ సునీల్‌కుమార్, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి అన్నారు. మండలంలోని మాధవరం పంచాయతీ గ్రామాల్లో గురువారం నియోజకవర్గ ఇన్‌చార్జ్, జెడ్పీ వైస్ చైర్మన్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ సురేష్‌బాబు సొంత గ్రామం మాధవరం కావడంతో ప్రచారానికి వచ్చిన నాయకులపై పూల వర్షం కురిపిస్తూ స్వాగతం పలికారు. మొదటగా మాధవరం దళితవాడలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. రాబోవు ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగనన్నను సీఎం చేస్తే ఇప్పుడు వస్తున్న పథకాలు కొనసాగుతాయని చెప్పారు. ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని శుక్రవారం మండలంలోని కొనాపల్లె, పెరింబాడి పంచాయతీ గ్రామాల్లో నిర్వహించనున్నట్లు జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు రవీంద్రబాబు, హరనారాయణ రెడ్డి, సర్పంచ్ రవి, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మనోహర్, మైనారిటీ సెల్ కార్యదర్శి కబీర్‌బాషా, నాయకులు కార్తిక్ రెడ్డి, మనోజ్‌రెడ్డి, సురేష్, గజేంద్ర యాదవ్, హేమక్క, తదితరలు పాల్గొన్నారు.

వలంటీర్లే రథ సారథులు

పూతలపట్టు: గ్రామ వలంటీర్లే రానున్న రోజుల్లో రాష్ట్రాన్ని ముందుకు నడిపించే రథసారథులని డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ బాలాజీ కల్యాణ మండపంలో గురువారం జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. గ్రామ వలంటీర్లను డాక్టర్ సునీల్‌కుమార్ ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని మాటల్లో కాకుండా చేతల్లో చూపించి అమలు చేసిన ఏకైక సీఎం జగన్‌మోహన్ రెడ్డిని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థతో ప్రజల ముగింటకే పాలన తీసుకెళ్లారన్నారు. వలంటీర్లు పారదర్శకంగా అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం వారిని సత్కరించి, నగదు పురస్కారాలు అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఉత్తమ సేవలందించిన వలంటీర్లను సన్మానించి, పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పెనుగొండ పరిశీలకులు బాబురెడ్డి, ఎంపీపీ కుమారి, మండల పార్టీ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ సంఘం అధ్యక్షులు జయచంద్రారెడ్డి, సీనియర్ నాయకులు రాజారత్నంరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు దేవిక, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు దొరస్వామిరెడ్డి, జయచంద్రారెడ్డి, స్థానిక సర్పంచ్ మాసిలామణి, కో–ఆప్షన్ మెంబర్ ఖాదర్, ఎంపీడీఓ ప్రసన్నకుమారి, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, మండల యువత అధ్యక్షులు నవీన్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

అక్కా చెల్లెమ్మల ఆర్థికాభివృద్ధికి ఆసరా

తవణంపల్లె: అక్కా చెల్లెమ్మలు ఆర్థికాభివృద్ధికి ఆసరా ఇస్తూ అండగా నిలుస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి సీఎంగా చేయాలని డాక్టర్ సునీల్‌కుమార్ పిలుపు నిచ్చారు. గురువారం వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కులను స్వయం సహాయక సంఘాలకు పంపిణీ చేశారు. మహిళలు వేలాదిగా తరలివచ్చి జైజగన్ నినాదాలతో తవణంపల్లె సభ మార్మోగిపోయింది. డాక్టర్ సునీల్‌కుమార్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి గజమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం అక్కాచెల్లెమ్మల ఖాతాలోకి జమ చేసి మాటనిలుపుకొన్నారని పేర్కొన్నారు. అనంతరం వైఎస్సార్ ఆసరా కింద మంజూరుఐన మండలంలోని 1298 సంఘాలకు రూ.13,45,35,000 చెక్కును పంపిణీ చేశారు. తర్వాత సీఎం జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఏపీఎం రవి, ఎంఈఓ హేమలత, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు హరిరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ శరత్‌రెడ్డి, పార్టీ నాయకులు హరికృష్ణారెడ్డి, కిషోర్ రెడ్డి, ప్రకాష్‌బాబురెడ్డి, మోహన్ రెడ్డి, వరప్రసాద్ రెడ్డి, ప్రకాష్‌బాబురెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రవిరెడ్డి, స్వరూప్‌రెడ్డి, తేజారెడ్డి, మధుకుమార్, అధికారులు, ప్రజాప్రతినిధులు, డ్వాక్రా సంఘ సభ్యులు, సీసీలు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు ప్రశంసనీయం



వలంటీర్లను సత్కరిస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్

మండల పరిషత్ కార్యాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అవార్డులకు ఎంపికైన వలంటీర్లను డాక్టర్ సునీల్‌కుమార్, ప్రజాప్రతినిధులు, అధికారులు శాలువలు కప్పి, పూలదండలతో ఘనంగా సత్కరించి అభినందించారు.





పూతలపట్టు: పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో ఇన్‌చార్జ్ సునీల్‌కుమార్, తవణంపల్లెలో ఆసరా చెక్కును పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

అశ్వవాహనంపై కాశీవిశ్వేశ్వరుడి విహారం



పలమనేరు: పట్టణంలోని శివాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం అశ్వవాహనం, సాయంత్రం గజవాహనంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. తొలుత ఆలయం వద్ద గ్రామోత్సవం, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కమలాకర్, సభ్యులు గోపాల్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

గ్రామీణులకు ఇంటి వద్దే మెరుగైన వైద్యం



గుడిపాల: వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రష్మిత

గుడిపాల: ఇంటి వద్దే మెరుగైన వైద్యం అందించే ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని బొమ్మసముద్రం డాక్టర్ రష్మిత అన్నారు. మండలంలోని వెంగమాంబపురం గ్రామంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనం వద్ద వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం ఇంటివద్ద మంచాన పడిన రోగుల వద్దకు వెళ్లి వారికి కావాల్సిన వైద్యసేవలను అందజేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు అందించి పౌష్టికాహారం తీసుకోవాలని వారికి సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది కవిత, హైమావతి పాల్గొన్నారు.

ఎగువ కమ్మకండ్రిగలో..

శ్రీరంగరాజపురం : మండలంలోని ఎగువకమ్మ కండ్రిగలో శుక్రవారం స్థానిక సర్పంచ్ కుమారి ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 107 మంది రోగులకు మండల వైద్యాధికారి సందీప్ వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం మంచానికే పరిమితమైన రోగులను వారి ఇళ్లకు వెళ్లి వైద్యపరీక్షలు చేశారు. ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. జ్వరం, జలుబు, ఆయాసం, దగ్గు సమస్యల బారిన పడితే స్థానిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.

కల్యాణం..కమనీయం

వి.కోట: పట్టణంలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. పట్టణానికి చెందిన (లేట్) పీఎస్ కృష్ణప్ప, సర్పంచ్ పీఎస్ లక్ష్మి కుమారులు, పీఎస్ నాగరాజు, పీఎస్ మంజునాథ్ దీనికి ఉభయదారులుగా వ్యవహరించారు. మేళతాళాలతో ఊరేగింపుగా వచ్చిన స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. తొలుత ఉదయం ఆలయంలో ప్రత్యేకపూజలు, అభిషేకాల అనంతరం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, పల్లకిలో కొలువుదీర్చి, పట్టణ వీధుల్లో ఊరేగించారు. ఆ తర్వాత మండల విశ్వ బ్రాహ్మణ సంఘం స్వామివారి కాశీయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించింది. అర్చకుల ఇంటి నుంచి మంగళవాయిద్యాల నడుమ స్వామి వారికి పూజాసామగ్రిని తీసుకువచ్చి శాస్త్రోక్తంగా కాశీయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్యాణోత్సవానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

గరుడోత్సవం

మండల బలిజ సంఘం ఆధ్వర్యంలో రాత్రి స్వామి వారిని గరుడవాహంపై కొలువుదీర్చి మంగళవాయిద్యాలు, పండరి భజనలు, కోలాటాల నడుమ పుర వీధుల్లో ఊరేగించారు. భక్తులకు తీర్థ,ప్రసాదాలు పంపిణీ చేశారు.

గడువు దాటితే ముప్పు తప్పదు

- వంట గ్యాస్ సిలిండర్‌కు కాలపరిమితి
- గ్యాస్ వినియోగంలో జాగ్రత్తలు



సిలిండర్‌పై కోడ్ విధానంలో ఉన్న గడువు తేదీ ఏ-25

గుడిపాల: గ్యాస్ సిలిండర్‌తో వంట చేసుకోవడం ఎంత సులభమైన పద్ధతో సరైన జాగ్రత్తలు పాటించకపోతే అంతే ప్రమాదం కూడా ఉంటుంది. సిలిండర్‌కు కాలపరిమితి ఉంటుందని, దానిని గమనిస్తుండాలని నిపుణులు చెబుతున్నారు. గడువు తేదీ ముగిసిన సిలిండర్‌ను వినియోగిస్తే గ్యాస్ లీకయ్యే ప్రమాదం ఉంది. వంటగ్యాస్ కంపెనీలు సరఫరా చేసే ప్రతి సిలిండర్‌పై గడువుతేదీని కోడ్ విధానంలో మెటల్ ప్లేట్‌పై ముద్రిస్తాయి. సిలిండర్‌ను మార్చుతున్నప్పుడల్లా ఆ గడువు తేదీని చూసుకొని ఉపయోగించాలి.

ఇలా గుర్తించాలి

ఉదాహరణకు సిలిండర్ మెటల్ ప్లేట్‌పై ఏ–24 అని ఉంటే, ఆ సిలిండర్ 2024 మార్చికి ఎక్స్‌పైరీ అవుతుందని అర్థం. 24 అంకె 2024 సంవత్సరానికి, ఆంగ్ల అక్షరం త్రైమాసికానికి సూచిక. ఏ అక్షరం జనవరి నుంచి మార్చి వరకు, బీ అక్షరం ఏప్రిల్ నుంచి జూన్ వరకు, సీ అక్షరం జూలై నుంచి సెప్టెంబర్ వరకు, డీ అక్షరం అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు అని గుర్తించాల్సి ఉంటుంది.

ఎట్టి పరిస్థితుల్లోనూ తీసుకోవద్దు

సిలిండర్ ఇంటి వద్దకు వచ్చిన వెంటనే మెటల్ ప్లేట్‌పై కోడ్ విధానంలో ఉన్న గడువు తేదీని గుర్తించాలి. గడువు తేదీ నెల వ్యవధిలో ముగుస్తున్నట్లు సిలిండర్‌పై ఉంటే దానిని తీసుకోకూడదు. ఎందుకంటే చిన్న కుటుంబాల వారికి నెలరోజులకు పైగా గ్యాస్ వస్తుంది. ఆ సిలిండర్ స్థానంలో వేరే సిలిండర్‌ను అడిగి తీసుకొనే హక్కు వినియోగదారుడికి ఉంది.

సిలిండర్‌కు పదేళ్ల గడువు

సిలిండర్ తయారైనప్పటి నుంచి పదేళ్ల వరకు గడువు ఉంటుంది. సిలిండర్‌ను ప్రత్యేకమైన ఉక్కుతో సిలిండర్ లోపల సురక్షితమైన కోటింగ్‌తో బ్యూరోఆఫ్ ఇండియన్ స్టాండర్స్(బీఐఎస్) ప్రమాణాల మేరకు తయారుచేస్తారు. బీఐఎస్ అనుమతులు తీసుకున్న తరువాతే సిలిండర్ మార్కెట్‌లోకి వస్తుంది.

వినియోగదారుడికి హక్కులు

- గ్యాస్ సిలిండర్ వినియోగదారులకు హక్కులు ఉన్నాయి. గ్యాస్ కనెక్షన్ కలిగిన వినియోగదారుడు మృతి చెందితే వారి కుటుంబ సభ్యుల పేరిట ఆ కనెక్షన్‌ను మార్పు చేసుకోవచ్చు.
- కొత్త కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే నిబంధనల మేరకు ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తే అదేరోజు కనెక్షన్ పొందవచ్చు.
- కొత్త కనెక్షన్ తీసుకొనే సమయంలో తమ వద్దనే స్టౌ కొనుగోలు చేయాలని డీలర్ కోరవచ్చు. అయితే డీలర్ వద్దనే స్టౌ కొనుగోలు చేయాలన్న నిబంధన ఏమీ లేదు.
- దీంతోపాటు గ్యాస్ ఏజెన్సీ నుంచి 5 కిలోమీటర్ల పరిధిలోని వినియోగదారులకు సిలిండర్ ఉచితంగా డోర్ డెలివరీ చేయాలి.

దిగువ తడకరలో ఉపాధి పనుల పరిశీలన



దిగువ తడకరలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ సుబ్రమణ్యం

తవణంపల్లె: మండలంలోని దిగువ తడకరలో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం ఏపీడీ సుబ్రమణ్యం పరిశీలించారు. దిగువ తడకరలో కాలువ పూడికతీత పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. కూలీలకు దినసరి వేతనం ఎంత వస్తోంది.. సకాలంలో కూలీలకు డబ్బులు అందుతున్నాయా లేదా అని ఆరాతీశారు. కూలీలకు రోజుకు రూ. 272 వేతనం వచ్చేలా పనులు చేయించాలని చెప్పారు. వేసవి దృష్ట్యా ఉదయం వేళల్లోనే పనులు చేయాలని కూలీలకు సూచించారు. మండలంలో అన్ని పంచాయతీల్లో కూలీల సంఖ్య పెంచాలన్నారు. కూలీలు పని చేసే ప్రాంతాల్లో నీడ ఏర్పాటు చేయాలని సూచించారు. తాగునీరు, ప్రథమ చికిత్స కిట్స్ కూడా అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీడీతో పాటు ఏపీఓ లలిత, ఫీల్డు అసిస్టెంట్లు, టీఏలు, మేట్లు, కూలీలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.